## 2019 అక్టోబరు 1 న నెల్లూరులో ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో

# సామ్రాజ్యవాదము, పెట్టుబడిదారీ వర్గాలు సృష్టిస్తున్న ఆర్థిక సంక్షోభాలు - పరిష్కార మార్గాలు అంశంపై రాష్ట్ర సదస్సు

**పెద్దనోట్ల** రద్దు, జి.ఎస్.టి.ని ప్రవేశ పెట్టడం దేశ ప్రయోజనాల కోసమేనని నమ్మబలక జూసిన మోడీ ప్రభుత్వ చర్యల వల్ల దేశంలో కోటిమంది ఉపాధి కోల్పోయారని ప్రభుత్వపు లెక్కలే వెల్లడి చేశాయి. జాతీయోన్మాదాన్ని, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మోడీ 2వ సారి గద్దెనెక్కిన 3 నెలలలోనే ఆర్థిక వ్యవస్థలోని డొల్లతనం బట్టబయలైంది.

ఆటోమొబైల్ (కార్లు, ఆటోలు, స్కూటర్లు వగైరా) కంపెనీల అమ్మకాలు జూలై మాసంలోనే 36 శాతం పడిపోయాయని లెక్కలు తేల్చారు. 10 లక్షల ఉద్యోగుల్ని ఇంటికి పంపుతామని ఆ పరిశ్రమల సంఘం ప్రకటించింది. టీ తోటల యజమానుల సంఘం తమ అమ్మకాలు పడిపోయినందువల్ల 10 లక్షల కార్మిక కుటుంబాలు సంక్షోభంలో పడ్డాయని చెప్పింది. 5రూ॥ బిస్కట్ పాకెట్ల అమ్మకాలు కూడ పడిపోయినందు వల్ల 10 వేలమంది కార్మికుల్ని లే ఆఫ్ చేస్తానని పార్లే–జి కంపెనీ హెచ్చరించింది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతున్న కాలంలోనే మోడీ దేశ స్థూల ఉత్పత్తి (జి.డి.పి.)ని 5 ట్రిలియన్ డాలర్లకు పెంచుతానని ప్రకటించడం చూసి అర్థికవేత్తలు ఆగ్రహించారు.

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటనలు విడ్డూరంగా వున్నాయి. కార్లు నిల్వపడి వున్నాయంటే ప్రభుత్వ అవసరాలకోసం కొనుగోలు చేసి కార్ల పరిశ్రమను కష్టాల నుండి గట్టెక్కిస్తానంటుంది. బ్యాంకులు ఎందుకు విలీనం చేశావంటే – పెద్ద పెద్ద అప్పులు ఇచ్చే శక్తివంతమైన బ్యాంకులుగా రూపొందించడానికేనని చెప్పింది. మొన్న మార్చి 2019 నాటికి తేల్చిన లెక్కల ప్రకారం బ్యాంకుల మొండి బకాయిలు 8 లక్షల 6వేల 412 కోట్ల రూ॥ వసూలు గురించి నోరు మెదపదు. ఎందరి అప్పులు ఎంత రద్దు చేసిందీ చెప్పదు. గత ఆర్థిక సం॥లోనే బ్యాంకులలో మోసాలు 84 శాతం పెరిగాయి. పైగా రిజర్వు బ్యాంకు వద్ద నిల్వల నుండి ప్రభుత్వం కష్టాల నుండి గట్టెక్కడానికంటూ ఒకలక్షా 76వేల కోట్ల రూ॥ కేంద్రం తీసుకున్నది చాలక అదనంగా మరో 54 వేల 225 కోట్లు ఇమ్మని అడుగుతోంది. (3 లక్షల కోట్లు ఇమ్మని డిమాండు చేస్తోంది)

గత 2 దశాబ్దాలుగా కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు పనికిరానివని, వాటిని క్రోడీకరించాలని గత 5 సంవత్సరాలుగా ప్రకటిస్తూ వచ్చిన పాలకులు ఈసారి అధికారంలోకి రాగానే వేజ్ (వేతనాల) కోడ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. నెలకు 18 వేల రూ॥ కనీస వేతనాన్ని పే కమీషన్లు ప్రకటించినప్పటికీ –కార్మికుల వేతనాల్ని నిర్ణయించడానికి ప్రాతిపదిక వారి కనీస అవసరాల (తిండి, బట్టలు, వసతి తదితర కనీస కుటుంబ ఖర్చులు)ను లెక్కించి పరిగణించాలన్న సూత్రం వున్నప్పటికీ–వాటినన్నిటిని పక్కన పెట్టి 'ఒకే దేశం–ఒకే వేతనం' పేరిట అతి కనిష్టంగా రోజుకు రు.178 కనీస వేతనాన్ని ప్రకటించింది. రోజుకు కుటుంబ కనీస ఖర్చు రు.600గా లెక్కించగా అందులో 1/3 వ వంతు కూడ ఇవ్వ నిరాకరిస్తున్నారు. కంపెనీలు తమ డైరెక్టర్లకి సగటున సంవత్సరానికి కోటి రూపాయలు చెల్లిస్తూ–కార్మికుల వేతనాల వాటాను మాత్రం అతి కనిష్టంగా దిగకోస్తున్నారు. మారుతి సుజుకి కంపెనీ ఖర్చుల్లో కార్మికుల వేతనం వాటా 4.2 శాతం కాగా, బ్రిటానియా బిస్కట్ కంపెనీ చెల్లిస్తున్నది 4.7 శాతం మాత్రమే. రిలయన్స్, ఎయిర్‌టెల్ వంటి సెల్‌ఫోన్ కంపెనీలు చెల్లిస్తున్నది 3 శాతమే. ప్రైవేటు రంగంలోని అత్యధికులు, ప్రభుత్వరంగం లోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పొందుతున్నది సుమారుగా నెలకు రూ.10 వేల లోపే.

మోడీ తన ప్రసంగాల్లో సంపద సృష్టికర్తలు పెట్టుబడిదారులేననీ, అందువల్ల వారికి మద్దతుగా నిలిస్తేనే దేశ సంపద పెరుగుతుందని ప్రబోధిస్తున్నాడు. విదేశీ పెట్టుబడిదారులను సమావేశపరచి మరీ – "మా దేశంలో శ్రమ శక్తి కారుచౌక గనుక మా దేశంలో పెట్టుబడులు పెట్టుకొని లభాలు సంపాదించుకొండి" అని ఆహ్వానించాడు. ఎఫ్.డి.ఐ. అంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు. దేశంలోని రక్షణ రంగం, రైల్వేలు, టెలీ కమ్యూనికేషన్లు, విమానయానం, శాటిలైట్లు (అంతరిక్ష రంగం), విద్యుత్తు, పెట్రోలియం, మైనింగు, బొగ్గు తదితర అన్ని రంగాల్లోకి నూటికి నూరు శాతం దీన్ని అనుమతిస్తూ చట్టాలు చేశారు. ఎఫ్.డి.ఐ. అంటే ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అనే పదానికి బదులు ఫస్ట్ డెవలప్ ఇండియా (తొలుత ఇండియాను అభివృద్ధి చేయడం) అని కొత్త వివరణనిస్తున్నాడు మోడీ.

నీతి ఆయోగ్ సంస్థ 74 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల జాబితా తయారుచేసి అందులో కొన్నిటిని పూర్తిగా ప్రైవేటుకు కట్టబెట్టేందుకు (స్ట్రాటజిక్ సేల్), కొన్నిటిలో షేర్లు అమ్మేందుకు (డిస్ ఇన్వెస్ట్‌మెంట్) వర్గీకరించారు. లాభదాయక సంస్థలైన ఒఎన్‌జిసి, గెయిల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, కోల్ ఇండియా, బిహెచ్ఇఎల్, ఎన్‌టిపిసి, పవర్ గ్రిడ్ వంటి సంస్థలను అమ్మబూనుకుంది. ప్రభుత్వ రంగంలోని బి ఎస్ ఎన్ ఎల్‌ను ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి నెట్టి అంబానీల జియో ఫోన్లను ప్రభుత్వమే ప్రోత్సహించింది. ప్రభుత్వం పని 'వ్యాపారం' కాదని అంటూ–దశాబ్దాల తరబడి కార్మికుల, ఉద్యోగుల శ్రమ శక్తితో పోగు పడిన వేల కోట్ల రూపాయల విలువైన దేశ సంపదలను కారుచౌకగా స్వదేశీ విదేశీ పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారు.

ఉద్యోగాలకల్పన జరగాలంటే విదేశీ పెట్టుబడులు రావాలంటున్నారు. కానీ గత 5 సం॥ల లెక్కలు చూస్తే విదేశీ పెట్టుబడుల్లో

వుత్పాదక రంగంలోకి 28 శాతం మాత్రమే రాగా - మిగిలిన 72 శాతం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలోకి, స్టాక్ మార్కెట్, ద్రవ్య సర్వీసులలోకే వచ్చాయి. వీటివల్ల వచ్చిన ఉద్యోగాలు అతి స్వల్పం. నిరుద్యోగం ప్రస్తుతం దేశంలో గత 45 సం॥లుగా ఎపుడూ లేనంతగా పెరిగిందని గణాంకాలు చెపుతున్నాయి. మరోవైపు జి.డి.పి. వృద్ధిరేటు ఎపుడూ లేనంత కనిష్టంగా 5 శాతానికి పడిపోయింది.

సగానికి పైగా జనాభా ఆధారపడుతున్న వ్యవసాయరంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. లక్షలాది మంది రైతులు - ప్రత్యేకించి అభివృద్ధి చెందాయని, ఆధునిక వ్యవసాయం జరుగుతున్నదని చెప్పే రాష్ట్రాల్లోనే ఆత్మహత్యలకు తలపడ్డారు. ఉత్పాదక ఖర్చుల పెంపు, బ్యాంకు ఋణాలు ఇవ్వకపోవడం, గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం వంటి పాలకుల విధానాలు చేసిన హత్యలివి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల రూపంలో విదేశీ గుత్త సంస్థలు లాభాల పంటలు పండించుకోగా- గ్రామీణ ప్రాంతాల్లోని వడ్డీ వ్యాపారులు కూడ రైతుల రక్తాన్ని పీల్చివేశారు. పాలకులు గ్రామీణ పేదలకు భూములు పంపకం చేయకపోగా- పారిశ్రామికవేత్తల కోసం రైతాంగం నుండి బలవంతంగా భూములను గుంజుకునేందుకు అవసరమైన చట్టాలు చేశారు. మరోవైపు గుత్త కంపెనీల మైనింగ్ అవసరాల కోసం గిరిజనుల్ని అడవుల నుండి తరలి వెళ్ళేలా చేస్తున్నారు. ప్రభుత్వపు తప్పుడు రిపోర్టులను ఆధారం చేసుకుని సుప్రీంకోర్టు ఇటీవలే లక్షలాది గిరిజనులను అడవుల నుండి ఖాళీ చేయమని ఆదేశించింది.

ఆర్థిక రంగంలో తను తీసుకుంటున్న భూస్వామ్య- పెట్టుబడిదారీ - సామ్రాజ్యవాద అనుకూల విధానాలు ప్రజా జీవితంపై పడవేస్తున్న దుష్ప్రభావాలను మరుగు పరిచేందుకు మత విద్వేషాలను రెచ్చగొట్టడమే గాక జాతీయోన్మాదాన్ని కూడ ప్రభుత్వం రెచ్చగొట్టింది. గత 70 సంవత్సరాలుగా కాంగ్రెసు, జనతా, బిజెపి-పాలకులెవరైనా దేశంలో పెరుగుతున్న సంక్షోభం నుండి దృష్టి మరల్చేందుకు విదేశీ ప్రమాదాలను బూచిగా చూపెడుతూనే వచ్చారు. మోడీ, షాల బృందం మరింతగా ఇందులో ఆరితేరింది.

దేశాన్ని జైలుగా మర్చారు. కాశ్మీర్ అంశాన్ని ఉద్రిక్తతలు పెంచడానికి సాధనంగా వాడుతూ ఆర్టికల్ 370ను, 35ఎ లను రద్దుపరచడం ద్వారా-అక్కడకు స్వదేశీ, విదేశీ గుత్త పెట్టుబడుల ప్రవేశానికి మార్గం వేసుకున్నారు. ఇపుడిక కాశ్మీరీ యువత కూడ అక్కడ ఉద్యోగాలు పొందలేక వలస బాటలు పట్టాల్సిన దుస్థితికి నెడుతున్నారు. రాష్ట్రాలలో ఏవిధంగానైనా జోక్యం చేసుకుంటానని, ఎంతటి సాయుధ బలగాలనైనా ప్రయోగిస్తానని ఈ చర్యల ద్వారా కేంద్రం చెప్పింది. మరోవైపు చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (UAPA) చేసి ఎవరినైనా అరెస్టు చేసి సంవత్సరాల తరబడి బెయిల్ కూడా లేకుండా జైలులో కుక్కే అధికారం తీసుకుంది.

1947 ఆగస్టు,15న వచ్చింది స్వాతంత్ర్యం కాదు-తెల్లదొరల నుండి నల్లదొరలకు అధికార మార్పిడి మాత్రమేనన్న అంచనా నిజమని అంతకంతకూ రుజువవుతోంది. దేశ 'స్వాతంత్రపు ఫలాలు' 1 శాతంగా వున్న సంపన్నులకే దక్కాయి. 78 శాతం దేశ సంపదలు వారి చేతుల్లోనే వున్నాయి. రాజ్యాంగ సభ ఆర్థిక అంతరాలను వీలైనంత త్వరగా తగ్గించాలని చెప్పగా-అంతరాలను అపరిమితంగా పెంచే లక్ష్యంతో పాలన సాగుతోంది.

స్వదేశీ, విదేశీ అప్పులపై ఆధారపడే కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు నడుస్తున్నాయి. అప్పులకు వడ్డీలు, కిస్తీలు కట్టడానికే బడ్జెట్‌లోని ఒక వాటా పోతోంది. ప్రజలపై పన్నుల భారాలు మోపుతూ-బడా కార్పొరేట్లకు, అందునా విదేశీ గుత్త కంపెనీలకు రాయితీలపై రాయితీలు ప్రకటించి బడ్జెట్‌లను దోచిపెడుతున్నారు. ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి వంటి సంస్థల షరతులకు మన పాలకులు దాసోహ మంటున్నారు.

సామ్రాజ్యవాద వలస ఆధిపత్య విధానాలకు మన పాలకులు 1947ల నుండే మద్దతు పలుకుతూ వస్తున్నారు. వారు సాగించే దురాక్రమణలకు వత్తాసు పలుకుతున్నారు. ఆర్థిక ఆంక్షలను అంగీకరిస్తున్నారు. ఇరాన్‌పై అమెరికా ఆగ్రహించి వారినుండి చమురు కొనుగోలును నిషేధిస్తే భారత ప్రభుత్వం కూడ దాన్ని అంగీకరించడం ఇందుకు తాజా నిదర్శనం.

పాలకుల విధానాల ఫలితంగా రైతాంగం కిందికి పడిపోతున్నారు. మధ్య తరగతి రైతాంగం సన్నకారుగా, సన్నకారు కౌలు రైతులుగా, వ్యవసాయ కూలీలుగా దిగజారుతున్నారు. వలసలబాట పడుతున్నారు. దేశంలోని శ్రామికుల్లో 6 శాతం మంది మాత్రమే సంఘటిత రంగంలో, పరిశ్రమల్లో పనిచేస్తుండగా-మిగిలిన 94 శాతం అసంఘటిత రంగంలోనే వున్నారు. శాశ్వత ఉద్యోగం ప్రభుత్వ రంగంలో గానీ, ప్రైవేటు రంగంలో గానీ లేకుండా పోతోంది. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతులు సర్వ సాధారణమయ్యాయి. ఉద్యోగ భద్రత, ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, బోనస్‌లు, ఇన్సెంటివ్‌లు, పెన్షన్‌ల వంటి పదాలు కనుమరుగవుతున్నాయి.

సోషలిజం విఫలమైందని పెద్దఎత్తున ప్రచారానికి పూనుకున్న సామ్రాజ్యవాద శక్తులు, ప్రత్యేకించి అమెరికా 2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభానికి విలవిలలాడింది. ప్రస్తుతం మన దళారీ పాలకులు సామ్రాజ్యవాద, బడా పెట్టుబడిదారీ, భూస్వామ్య అనుకూల విధానాలు చేపట్టిన ఫలితంగానే మనదేశంలో కూడా ఆర్థికమాంద్యం రోజురోజుకు తీవ్రమవుతోంది. ఈ పరిస్థితుల నుండి బయటపడి మెరుగైన జీవితాలను సాధించుకోవడమన్నది ప్రస్తుత దోపిడి వ్యవస్థను కూల్చి ప్రజాతంత్ర వ్యవస్థను సాధించుకోవడం ద్వారానే సాధ్యమవుతుంది. సోషలిజం, కమ్యూనిజం అన్నవి కార్మిక వర్గపు చిరకాల వాంఛలు. అవి సాధించాలంటే కార్మిక- కర్షక మైత్రి ద్వారా ప్రజాతంత్ర విప్లవ సాధనకు కార్మిక వర్గం నడుం బిగించాలి. ఈ కర్తవ్యాల గురించి చర్చించేందుకు AIFTU(N) నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సులో కార్మిక వర్గంలోని చైతన్యపూరిత శక్తులు పాల్గొనాలనీ - దీన్ని విజయవంతం చేసేందుకు ప్రజాతంత్రశక్తులంతా సహకరించాలనీ విజ్ఞప్తి చేస్తున్నాం.

**రాష్ట్ర కార్యవర్గం**

**AIFTU (New)**